11 April 2026

# పత్రికా ప్రకటన

అమరావతి ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా ఎంపిక అయిన 2014 నుంచీ ఆ నిర్ణయం ఎదుర్కొన్న సవాళ్లు, అంతిమంగా నష్ట పోతున్న అమరావతి రైతుల పరిస్థితి గురించీ అందరికీ తెలిసిన విషయమే.

శాసన సభలో విస్తృత చర్చ అనంతరం అప్పటి ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి గారు అమరావతిలో రాజధాని ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేయడం చారిత్రక సత్యం. మొక్కుబడిగా ఒప్పుకున్నా, అప్పట్లో అమరావతి నిర్మాణానికి ఎన్ని ఆటంకాలు పెట్టగలరో అన్ని ప్రయత్నాలూ చేసిన చరిత్ర YSRCP పార్టీది. NGT లోను, సుప్రీం కోర్టు లోను వ్యాజ్యాలు, ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు అందులో మచ్చుకు కొన్ని మాత్రమే.

తీరా పనులు పెద్ద ఎత్తున మొదలయ్యే సమయానికి 2019 ఎన్నికలు రావడం, ఆ ఎన్నికల ప్రచారంలోనూ తన చెల్లి, తల్లి, ఇతర YSRCP నాయకులతో సహా అమరావతే రాజధానిగా ఉంటుందని, దాన్ని మరింత మెరుగ్గా తీర్చి దిద్దుతానని, తాను అక్కడ ఇల్లు కట్టుకోవడమే దానికి ఋజువనీ నమ్మించారు.

2019 లో అధికారం చేపట్టడంతోనే అమరావతి పనులు ఆపేయడం, మూడు రాజధానుల మాట ఎత్తుకోవడం, కోర్టు తీర్పులతో వెనక్కి తగ్గాల్సి రావడం, శాసన సభల్లో, ముఖ్యంగా శాసన మండలిలో చేసిన రచ్చ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన అమరావతి రైతులపై, ముఖ్యంగా మహిళలపై చేసిన అకృత్యాలు, దుర్మార్గాలు, దౌర్జన్యాలు, పెట్టిన తప్పుడు కేసులు, ఆర్థిక, రాజకీయ బలాన్ని ఉపయోగించి చేయించిన జడ్జీల బదిలీలు - ఎప్పటికీ మర్చిపోలేని పీడ కలలు.

2019 ఎన్నికల ప్రచారంలో అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని, మరింత వైభవంగా తీర్చి దిద్దుతానని తానిచ్చిన మాటను మార్చినందుకు జగన్ మోహన్ రెడ్డి గారు ఎంత ప్రయత్నించినా లోకానికి జవాబు చెప్పలేకపోయారు.

2024 ఎన్నికల ప్రచారంలో అమరావతి విషయం ఒక ప్రధాన అంశం. చరిత్రలో జరగని రీతిలో ఎన్నికల్లో పరాభవం పొందాక కొన్నాళ్ళు మౌనంగా ఉన్నా, అమరావతి మీద కసి, ద్వేషం జగన్ మోహన్ రెడ్డి గారిని వదల్లేదు. ఆ మధ్య ఒకసారి సజ్జల రామకృష్ణా రెడ్డి గారు అమరావతిని పొడి పొడి మాటల్లో సమర్థించినట్టు మాట్లాడినా, మళ్ళీ వెంటనే వెనక్కు తీసుకున్నట్టు వార్తలొచ్చాయి.

ఇంకో వైపు, ప్రపంచ నగరంగా నిర్మిస్తామని ప్రణాళికలు రచించి, ప్రకటించి, రైతుల నుంచి భూమి సమీకరించిన కూటమి ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వచ్చినప్పటినుంచి నత్త నడక, తప్పటడుగులుగా వ్యవహరిస్తోంది. కారణాలు చెప్పకుండా, ప్రణాళికలేవీ చూపెట్టకుండా రెండో విడత, మూడో విడత భూసమీకరణ, లేకపోతే అమరావతి మున్సిపాలిటీగా మిగిలిపోతుందనే వింత మాటలు మొదలెట్టింది.

అమరావతి రైతులు దారి పొడుగునా పూలు పరిచి స్వాగతించిన ముఖ్య మంత్రి గారికి రైతులతో ముఖాముఖి కలవడానికి సంవత్సరంన్నర పట్టింది. అది కూడా రెండో విడత భూసమీకరణ అవసరార్థమే. రెండు, మూడు విడత రైతులలో నమ్మకం కలిగించడం కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటులో విభజన చట్టానికి సవరణలు తెచ్చి, అమరావతి పేరు పొందు పర్చారు.

ఈ మాత్రానికే అమరావతి మీద ఇన్వెస్టర్ల ఆసక్తి ఎక్కడ పెరిగిపోతుందో, ఎక్కడ అమరావతి సాకారమౌతుందో అనే దుగ్ధతో జగన్ మోహన్ రెడ్డి గారు హడావుడిగా పత్రికా సమావేశం పెట్టి, మావిగన్ అనే వింత పదార్థాన్ని తెరపైకి తెచ్చారు. చూడ్డానికి హాస్యాస్పదంగా అనిపించినా, ఆయన ఉద్దేశం ఒక్కటే. తాను అధికారంలోకి వస్తే అమరావతిని నాశనం చేసి

తీరుతానని ఇన్వెస్టర్లను హెచ్చరించడమే. దాన్ని అందరూ సీరియస్ గా తీసుకు తీరాలనే ఉద్దేశం తోనే అవినీతి విష పుత్రిక సాక్షి పత్రికలోను, తన ఇంటి చుట్టూ ఫ్లెక్సీల లోను, ఏదో పత్రికలో ఏదో రాశారనే నెపంతోను రోజా యాగీ చెయ్యడం చూస్తూనే ఉన్నాం.

జగన్ మోహన్ రెడ్డి గారి పడగ నీడకు ఈ రాష్ట్రం మరో మారు గురైతే, మిగతా విషయాలతో పాటు అమరావతి విధ్వంసం తథ్యం. ఈ సారి "నేను ముందే చెప్పాను (మావిగన్ అని), మాట మార్చడం లేదు" అనేది జగన్ మోహన్ రెడ్డి గారి వాదన అవుతుంది. అసెంబ్లీలో తిరిగి రివర్సు తీర్మానం చెయ్యొచ్చు, రాజకీయ అవసరం పడితే పార్లమెంటు తన నిర్ణయాన్ని తిరిగి తోడావచ్చు అనే మాటలు జగన్ మోహన్ రెడ్డి గారి నోటంటే వింటున్నాం.

ఒక వేళ విభజన చట్టాన్ని తిరిగి సవరించలేక పోయినా గానీ, అమరావతిని ధ్వంసం చేయడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ప్రభుత్వం దగ్గర ఉన్న భూములన్నీ సెంటు పట్టాల పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న YSRCP కార్యకర్తలకు పంచిపెట్టి, కావాలని దాన్నొక మురికివాడలా మార్చుతారు. మిగిలిపోయిన పనులేమన్నా ఉంటె ఎక్కడివక్కడ వదిలేస్తారు. సగం వేసిన రోడ్లను తవ్వుకు పోతారు. అమర్చకుండా మిగిలిన పైపులు, కేబుళ్లు ఎత్తుకు పోతారు.

ప్రభుత్వాన్ని నమ్మి ఇప్పటికే మోసపోయిన అమరావతి రైతులకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత, చేసుకున్న ఒప్పందాన్ని అమలు చెయ్యాల్సిన బాధ్యత ఈ కూటమి ప్రభుత్వానిది, రాష్ట్ర ప్రజలందరిదీను. ఒప్పందం ప్రకారం మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతుల ప్లాట్ల కేటాయింపు, అప్పగింత, రాజధాని నిర్మాణం, ప్రపంచ స్థాయి సంస్థల రప్పింపు, ఉద్యోగావకాశాల కల్పన - ఇవన్నీ ప్రభుత్వ నైతిక, చట్టపరమైన బాధ్యతలు. ఇవేవీ రైతులకు మీరు చేసే దాన ధర్మమో, ఉపకారమో కాదని గుర్తుంచుకోవాలి.

జగన్ మోహన్ రెడ్డి గారి అరాచకపు బెదిరింపులు, అమరావతిలో పనుల నత్తనడక, సైకోలను కట్టడి చేయడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యం, 2019-24 లో జరిగిన దౌర్జన్యాలు, అరాచకాలను చట్టం ముందు నిలబెట్టలేని అసమర్థత, పాలనా యంత్రాంగంలో నెలకొన్న నైరాశ్యం - ఇవన్నీ కూటమి కళ్ళకు కనపడకపోయినా, ఇన్వెస్టర్లకు కనపడుతున్నాయి. అందువల్ల వాళ్ళెవరూ ఇప్పటికిప్పుడు ధైర్యం చెయ్యలేరు.

ఇన్వెస్టర్లలోను, భూములిచ్చిన రైతుల్లోను, అమరావతిని ఒక అభివృద్ధి చెందిన రాజధానిగా చూడాలనుకుంటున్న యావత్ తెలుగు ప్రపంచంలోనూ నమ్మకం కలిగించాలంటే కూటమి ప్రభుత్వం చెయ్యాల్సిన తప్పనిసరి పనులు:

1. మౌలిక వసతుల కల్పన (Trunk Infrastructure), రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను అప్పగించడం వచ్చే ఎన్నికల్లోగా ఏ పనినీ మిగల్చకుండా పూర్తి చేయాలి. దానికి అవసరమైన డబ్బు ఇప్పటికే ఉంది, సాంకేతికంగా కూడా అది సాధ్యమే. ఈ విషయంలో ఏ వైఫల్యం జరిగినా కూటమి ప్రభుత్వమే నైతిక, రాజకీయ బాధ్యత వహించాలి.

2. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కార్యాలయాల నిర్మాణం అన్ని విధాలా, పూర్తి స్థాయిలో పూర్తి చెయ్యాలి.

3. ప్రభుత్వం దగ్గర ఇప్పటికీ మిగిలి ఉన్న వేలాది ఎకరాలను జోన్ల వారీగా తగిన షరతులతో దేశ, విదేశాల్లోని ఇన్వెస్టర్లకు అమ్మేసి బదలాయించాలి. వచ్చే ఎన్నికల నాటికి ప్రభుత్వం చేతిలో ఏ మాత్రం భూమి మిగిలి ఉండ కూడదు. అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం ఏ జోన్ లో ఏ రకమైన నిర్మాణాలు రావాలో అటువంటి నిర్మాణాలే చేసే షరతులతో భూమంతా third parties కి బదలాయించడమే అమరావతి మురికివాడగా మిగిలిపోకుండా నిరోధించే ఏకైక పరిష్కారం.

4. దీని కోసం జోన్ల వారీగా రేట్ల పట్టికలను ప్రకటించండి. కొనుగోలుదారులను, ఇన్వెస్టర్లను తెచ్చే బాధ్యత ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారు, ఆంధ్ర ప్రదేశ్ శ్రేయోభిలాషులకు కూడా అప్పగించండి. ప్రభుత్వం తన ప్రయత్నం తానూ చెయ్యాలి. కానీ ప్రభుత్వమే ఇదంతా చెయ్యగలదనే నమ్మకం ఇప్పటికే సడలి పోయింది. అసలు ఈ ప్రభుత్వానికి అమరావతి విషయంలో చెయ్యాలనే ఆసక్తి ఉన్నట్టుగా కూడా కనపడడం లేదు.

5. 2014 నుంచీ పెండింగులో ఉన్న భూముల సమీకరణ లేదా సేకరణ సంవత్సర కాలంలో పూర్తి చెయ్యాలి.

6. ప్రభుత్వం అధీనంలో ఉన్న భూములన్నీ అమ్మేశాక కూడా, CRDA ఇంకేమన్నా బాకీ పడితే ఆ బాకీని రాష్ట్ర ఖజానా స్వీకరించాలి. ఎందుకంటే అమరావతి రైతులకిచ్చిన ఒప్పందాలు పూర్తి చెయ్యాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిదీ.

7. కూటమి ప్రభుత్వం రెండు, మూడు విడతల భూసమీకరణ ప్రయత్నాలు వెంటనే విరమించాలి. మొదట విడత బాధ్యతలను పూర్తి చేసే సామర్థ్యం మీదే అనుమానాలు ఉన్నాయి.

8. అమరావతి చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఏ గ్రామాలు, మండలాలు భవిష్యత్తులో రాజధాని విస్తరణలో భాగమవుతాయని భావిస్తున్నారో ఆ ప్రాంతాలన్నిటికీ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ప్రకటించాలి.

9. మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా రైతులో, వారి వారసులో లేక వారి దగ్గర్నుంచి కొనుగోలు చేసే వారో మార్కెట్ డిమాండు మేరకు కట్టుకోవడమో, డెవలప్మెంట్ ఒప్పందాలు కుదుర్చుకోవడమో వారికే వదిలేయాలి. ప్రభుత్వాలు, ఆఫీసర్లకంటే వాళ్ళే తెలివైన నిర్ణయాలు తీసుకోగలరని గుర్తించాలి.

10. హైద్రాబాదు, సైబరాబాదులు 1995 మాస్టర్ ప్లాన్ అనుసరించి అభివృద్ధి చెందాయి తప్ప భూసమీకరణ ద్వారా కాదనే వాస్తవాన్ని గుర్తెరగాలి.

11. క్వాంటమ్ కబుర్లతో కాలక్షేపం చేయడం మానుకుని కూటమి ప్రభుత్వం భూములిచ్చిన రైతుల పట్ల తన బాధ్యతలను నెరవేర్చడంలో నిమగ్నమవ్వాలి.

12. గన్నవరం విమానాశ్రయం పనులను వెంటనే పూర్తి చేసి, అంతర్జాతీయ విమాన సర్వీసులను వెంటనే తీసుకు రావాలి. విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు గారు దీనికి పూర్తి బాధ్యత వహించాలి. గన్నవరం - అమరావతి కనెక్టివిటీ పనులు వెంటనే చేపట్టాలి.

13. భోగాపురం GMR ఎయిర్పోర్టు, దానికి వందల కోట్ల ఖర్చుతో రోడ్లు వేసే శ్రద్ధ గన్నవరం - అమరావతి పట్ల కూడా చూపాలి.

14. ఇంకో 5000 ఎకరాలు GMR కో, అదానీ కో కట్టబెట్టి, గన్నవరం విమానాశ్రయాన్ని పండబెట్టే ప్రయత్నాలు మానుకోవాలి.

15. జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో అమరావతి అణచివేత, విధ్వంసం జరుగుతున్నప్పుడు "రాజధాని అనేది రాష్ట్రం స్వవిషయం, అందులో మా ప్రమేయం లేదు" అని చేతులు దులిపేసుకున్న కేంద్రాన్ని, గాలి వాన లాంటి నరసింహా రావు ల ప్రేలాపనలను, బీజేపీ రాష్ట్ర నేతలు ఆమడ దూరాన్నుంచి చోద్యం చూసిన వైనాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు.

16. రాజకీయ అవసరాలే తప్ప అమరావతి పట్ల అభిమానం కానీ, చిత్తశుద్ధి కానీ, నిబద్ధత కానీ ఢిల్లీ పాదుషాలకు లేవని రాష్ట్ర ప్రజలందరూ గుర్తించారు.

మరో వైపు, అమరావతి విధ్వంసమే తన ధ్యేయంగా బహిరంగంగా ప్రకటిస్తున్న జగన్ మోహన్ రెడ్డి గారికి ఇవే మా సవాళ్లు:

1. అమరావతి రైతులు తీసుకున్న రిస్కుని గుర్తించకుండా వాళ్ళ మీద పడి ఏడ్చే మీరు, చేతనైతే మీ సొంత నియోజకవర్గంలో ఒక్క వెయ్యి ఎకరాలు సమీకరించి చూపించగలరా?

2. అమరావతి నిర్మాణాల్లో అవినీతి అని పాట మొదలెట్టిన మీరు, ఆ అవినీతికి సంబంధించి ఏ ఏ ఆధారాలు సంపాదించారు? ఏ న్యాయపరమైన చర్యలు తీసుకున్నారు?

3. ఆధారాలతో సహా న్యాయస్థానం ముందుంచిన షిర్డీ సాయి ఎలెక్ట్రికల్స్ అవినీతి విషయంలో మీ నోరు మూగబోయిందేం?

4. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు డబ్బుల్లేవంటూనే ఒక పనికిరాని పోలవరం లిఫ్టుకి 900 కోట్లు మెగా కంపెనీ కి ఇచ్చేస్తోంటే మీ గొంతు పెగలదేం? మీ సాక్షి పలకదేం?

5. అవన్నీ మీ బినామీ సంస్థలు కాబట్టా? ఆ అవినీతిలో మీ వాటా మీకు ముడుతున్నందుకా? అమరావతి నిర్మాణ సంస్థల నుంచి వాటా రావడం లేదా?

6. అమరావతికి 2 లక్షల కోట్లు ఖర్చవుతుందనే అబద్దాలతో మిగిలిన ప్రాంతాల ప్రజల్లో అసూయ ద్వేషాలు రగులుస్తున్న మీరు అసలు ఆ 2 లక్షల కోట్ల వివరాలివ్వగలరా? నిజానికి అమరావతి కట్టడానికి అయ్యే ఖర్చెంత అన్నదాంతో భూములిచ్చిన రైతులకు సంబంధం లేదు. చేసుకున్న ఒప్పందం ప్రకారం పనులు చేసి అప్పగించాల్సిన చట్టపరమైన బాధ్యత ప్రభుత్వానిది.

7. అమరావతి మీద ఈ రకంగా జరుగుతున్న కుట్రలను బయటపెట్టకుండా, గుడ్డి వాళ్ళు ఏనుగుని వర్ణించినట్టుగా మావిగన్ పాట పాడుతున్న పేటీఎం మేధావులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నాం.

రాజధాని అమరావతి, భవిష్యత్తులో ఏ కుట్రలకూ బలి కాకుండా, రైతులకిచ్చిన ఒప్పందానికి, CRDA చట్టానికి అవసరమైన మార్పులు చేసి, రైతులకు enforceable estoppel హక్కులు కల్పించాల్సిందిగా డిమాండు చేస్తున్నాం.

A.B.Venkateswara Rao

Nalamotu Chakravarty

Y.Srinivasa Reddy

**Center For Liberty**

#8309926925 Harish